
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 23.736 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 23.736 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,580
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,800
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,974
సవర (8 గ్రాములు)	రూ.47,792

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.4 /23.8

బుధవారం గాలిలో తేమ 44 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. గురువారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

పదిలో మెరుగైన ఫలితాలు సాధిస్తాం

• నూతన డీఈఓ రామారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న రామారావు

నెల్లూరు(టౌన్‌): ఈ ఏడాది జరగనున్న పదో తరగతి పబ్లిక్‌ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని నూతన డీఈఓ రామారావు తెలిపారు. బుధవారం ఆయన నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలువురు ఉద్యోగులు, సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మెరుగైన బోధనను అందించేందుకు కృషి చేస్తామన్నారు. వచ్చే నెలలో జరగనున్న పదో తరగతి పబ్లిక్‌ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలు

• డీసీఓ సుధాభారతి



మాట్లాడుతున్న డీసీఓ సుధాభారతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న 60 పీఏసీఎస్‌లను ఈ నెల 15వ తేదీ లోపు కంప్యూటీకరణ చేపట్టాలని ఆదేశించామని, తద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించే వీలు కలుగుతుందని జిల్లా సహకార అధికారిణి (డీసీఓ) సుధాభారతి తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్‌) సీఈఓ, ఆడిట్‌ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, మేనేజర్లకు ఒకరోజు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌ వద్దనున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో బుధవారం నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా సహకార అధికారిణి సుధాభారతి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఏసీఎస్‌ల కంప్యూటీకరణ కోసం రాష్ట్రానికి రూ.80 కోట్లు నిధులు కేటాయించారని, ఇందుకోసం ప్రభుత్వం నుంచి ప్రతి పీఏసీఎస్‌కు ఒక కంప్యూటర్‌, ప్రింటర్‌ మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, సహకార శాఖ ఆడిట్‌ అధికారి తిరుపతయ్య, బ్యాంకు జీఎం సరిత, డీజీఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

క్యాష్‌కే టీడీపీ సై..

టీడీపీ కావలి సీటు విషయంలో ఆ పార్టీ అధిష్టానం చివరకు క్యాష్‌ వైపే మొగ్గు చూపింది. కావ్య కృష్ణారెడ్డికే జై కొట్టి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. పార్టీని నమ్ముకున్న వారిని నట్టేట ముంచి డబ్బుసంచుల వైపు చూడడంతో దీనిని కేడర్‌ జీర్ణించుకోలేకపోతోంది. దశాబ్దాల నుంచి కావలిలో టీడీపీని కాపు కాసిన బీద రవిచంద్ర మాట కూడా చెల్లుబాటు కాలేదు. కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్న మాలేపాటి సుబ్బానాయుడికి సైతం మొండి చేయి చూపడంతో తెలుగు తమ్ముళ్లు భగ్గుమంటున్నారు.

- కావలి టికెట్‌ కావ్య కృష్ణారెడ్డికి ఖరారు
- చెల్లుబాటు కాని బీద మాట
- మాలేపాటికి మొండి చేయి
- నైరాశ్యంలో తెలుగు తమ్ముళ్లు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి టీడీపీ ఇన్‌చార్జిగా కావ్య కృష్ణారెడ్డి (దగుమాటి వెంకట కృష్ణారెడ్డి)ని ఆ పార్టీ అధికారికంగా ప్రకటించింది. స్థానికుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అభ్యర్థి ప్రకటన చేయడంపై క్యాడర్‌ మండిపడుతోంది. బీద రవిచంద్ర దశాబ్దాల కాలంగా పార్టీని నమ్ముకుని ఉన్నారు. ఆ కుటుంబానికే పార్టీ ప్రాధాన్యత ఇవ్వడంతో వారే అన్నీ తామై నడిపించేవారు. కానీ ఈ దఫా బీద రవిచంద్ర, ఆయన సతీమణిని ఎన్నికల బరిలోకి దింపే యోచనలో ఉన్నట్లు గతంలో ప్రచారం జరిగినా స్థానికంగా పార్టీ పరిస్థితి ఆశాజనకంగా లేక పోవడంతో తన ప్రధాన అనుచరుడిగా ఉన్న మాలేపాటి సుబ్బానాయుడిని ఇన్‌చార్జిగా నియామకం చేయించారు. కష్టకాలంలో మాలేపాటి పార్టీ కోసం నిలబడ్డారు. గత టీడీపీ హయాంలో అడ్డగోలుగా దోపిడీ చేసిన సొమ్ములో కాస్త కరిగించేలా చేశారు. చివరకు ఎన్నికల సమయంలో మాలేపాటికి టికెట్‌ ఇప్పించే ప్రయత్నంలో బీద మాట చెల్లుబాటు కాకపోవడంతో మిన్నకుండిపోవాల్సివచ్చింది.

కావ్య వర్సెస్‌ బీద

కావ్య కృష్ణారెడ్డి టీడీపీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీలోకి ఎంట్రీ ఇవ్వకముందే బీద రవిచంద్రతో అమీతుమీకి సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. డబ్బు సంచులతో పార్టీ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకుని టికెట్‌ ఖరారు చేయించుకుని వచ్చిన కావ్య కావలిలో హడావుడి చేశారు. బీదకు వ్యతిరేక వర్గాన్ని కూడదీయడంతోపాటు ఇకపై బీద మాట వినాల్సిన అవసరం లేదని, అంతా తన కనుసన్నల్లోనే జరుగుతుందనే సంకేతాలను కూడా ఆ పార్టీ కార్యకర్తల్లోకి పంపారు. కావ్య కృష్ణారెడ్డి ముందుగానే పార్టీ ఫండ్‌ పేరుతో రూ.కోటి విరాళం ఇచ్చారు. అంతేకాక ఏకంగా రూ.20 కోట్లు పార్టీ ఫండ్‌ కింద జమ చేసి మరో రూ.50 కోట్లు ఇచ్చే దానికైనా సిద్ధంగా ఉన్నానని సంకేతం పంపి లోకేశ్‌ వద్ద మార్కులు కొట్టేసి టికెట్‌ ఖరారు చేయించుకున్నారని తెలుస్తోంది.

అడ్డదారులు తొక్కుతూ..

సుమారు పాతికేళ్ల క్రితం కామర్స్‌ అధ్యాపకుడిగా ఉన్న కావ్య కృష్ణారెడ్డి తాను నివాసం ఉండే ఇంటికి అద్దె చెల్లించలేని స్థితి నుంచి అంచెలంచెలుగా ఎదిగి రూ.వేల కోట్లకు అధిపతి అయ్యారు. రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం నుంచి క్వారీలు, క్రషర్లు, కాంక్రీట్‌ మిక్సర్లు పెట్టి అడ్డదారులు తొక్కుతూ అతి తక్కువ కాలంలోనే మైనింగ్‌ డాన్‌గా ఎదిగారు. అడ్డగోలుగా ఎదిగిన కావ్య కృష్ణారెడ్డి అందించిన డబ్బు సంచులకు సాగిలపడిన టీడీపీ ఆయనకు కావలి సీటు ఖరారు చేయడంపై ఆ పార్టీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

పదవి పేరుతో ముంచేసి..



మండలస్థాయి నేతగా ఉన్న తనను కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి పేరుతో ముంచేశారని మాలేపాటి సుబ్బానాయుడు తన అంతరంగీకుల వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. గత టీడీపీ హయాంలో అడ్డగోలు సంపాదనకు అలవాటుపడిన మాలేపాటిని కావలి సీటు పేరుతో బీద ఊరించి అతని చేత ఖర్చు పెట్టించారని, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అతనిని నట్టేట ముంచారని పార్టీ నేతలు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

8, 9 తేదీల్లో ఎన్నికల శిక్షణ తరగతులు

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెల 8, 9 తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్‌ ట్రెయినర్లకు జిల్లాలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌ బుధవారం తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నోడల్‌ అధికారులుగా నియమితులైన జిల్లా అధికారులు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

చౌకదుకాణాల డీలర్లు రెన్యువల్‌ చేసుకోండి

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని చౌకదుకాణాల డీలర్లు వారి సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్‌ రెన్యువల్‌ చేయించుకోవాలని డీఎస్‌ఓ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్లందరూ ఈకేవైసీ చేయించుకోవాలని, ఈకేవైసీ చేయించుకున్న డీలర్ల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ వంద శాతం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బియ్యం, పప్పుల వ్యాపారం చేసే వ్యాపారులు, డీలర్లు, ట్రేడర్స్‌ వారి వద్ద ఉన్న బియ్యం, పప్పుల నిల్వల వివరాలు అందజేయాలని తెలిపారు. ప్రతి వారం విక్రయాలు, నిల్వల వివరాలు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. తనిఖీల సమయంలో నిల్వలు, విక్రయాల వివరాల్లో తేడాలు ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గ్రామ జల సంఘాల ద్వారా జల్‌ జీవన్‌ మిషన్‌ పనులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్‌ హరినారాయణన్‌

• కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌

నెల్లూరు(దర్గామిట్ట): గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్‌ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన జల్‌ జీవన్‌ మిషన్‌ పనులను స్వయం సహాయక సంఘాల్లోని మహిళలతో ఏర్పాటైన గ్రామ జల సంఘాల ద్వారా చేపట్టేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌ అధికారులను ఆదేశించారు. జల్‌ జీవన్‌ మిషన్‌, టెన్త్‌, ఇంటర్మీడియట్‌ పరీక్షల ఏర్పాట్లు, జగనన్న ఆరోగ్య సురక్ష-2, వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ, స్మార్ట్‌ కార్డుల పంపిణీ, ఆయుష్మాన్‌ భారత్‌, ఈకేవైసీ, జగనన్నకు చెబుదాం, సచివాలయంలో రిజిస్ట్రేషన్లు, చుక్కల భూములు, పెండింగ్‌ రెవెన్యూ సమస్యలపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్‌ కమిషనర్లతో బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్‌ వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జల్‌ జీవన్‌ మిషన్‌ పనుల విధివిధానాలపై ఈ నెల 10వ తేదీ లోపు గ్రామ జల సంఘాలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జల సంఘాల ద్వారా చేపట్టనున్న పనులకు అంచనాలు తయారు చేయాలని, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ, డీఈ నుంచి సాంకేతిక అనుమతి పొందాలని తెలిపారు. అలాగే మార్చి నెలలో జరగనున్న ఇంటర్‌, టెన్త్‌ పరీక్షలకు సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లను సకాలంలో చేపట్టాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరాల్లో ఓపీ రిజిస్ట్రేషన్‌ సంఖ్యను పెంచాలని, క్షేత్ర స్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ఇస్తున్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని, ఆయుష్మాన్‌ భారత్‌ కార్యక్రమంపై ఎంపీడీఓలు శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీన జిల్లావ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలు నిర్ణీత గడువు లోపు అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. జాయింట్‌ కలెక్టర్‌ ఆదర్శ్‌ రాజేంద్రన్‌ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎంపిక చేసిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఫ్రీ హోల్డ్‌ అసైన్‌మెంట్‌, చుక్కల భూములు, రీసర్వే తదితర పెండింగ్‌ రెవెన్యూ సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీపీఓ సుస్మిత, హౌసింగ్‌, డ్వామా పీడీలు నాగరాజు, వెంకట్రావు, డీఈఓ రామారావు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, మత్స్య, పశుసంవర్ధకశాఖ జేడీలు నాగేశ్వరరావు, మహేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

ఫాంపాండ్స్‌తో భూగర్భ జలాల వృద్ధి

- జిల్లాలో 4,400 ఫాంపాండ్స్‌ లక్ష్యం
- ఉచితంగా రైతుల పొలాల్లో ఏర్పాటు

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ నిధులతో రైతుల పొలాల్లో ఉచితంగా ఫాంపాండ్స్‌ (నీటి కుంటలు) ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. భూగర్భ జలాలు వృద్ధి చెందేలా, వేసవిలో సైతం రైతులు పంటలు సాగు చేసుకునేలా ఈ నీటి కుంటలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 4,400 ఫాంపాండ్స్‌ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఇందుకోసం సన్న, చిన్నకారు రైతులు మండల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు 250 మందికి పైగా రైతులు ఫాంపాండ్స్‌ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను ఉపాధి సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు జిల్లా అధికారులకు పంపనున్నారు. జిల్లా అధికారులు వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తున్నారు. మంజూరు చేసిన ఫాంపాండ్స్‌ను ఉపాధి హామీ కూలీలతో తవ్విస్తారు. ఒక్కో ఫాంపాండ్‌ను తవ్వడానికి 140 పనిదినాలు కల్పించనున్నారు. రైతుకు ఉపాధి హామీ జాబ్‌ కార్డు ఉంటే అతను కూలీలతో కలిసి పని చేసుకునే వెసులుబాటు కల్పించారు. జిల్లాలో 37 మండలాలు ఉన్నాయి. మెట్ట ప్రాంత మండలాల్లో రైతులు వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. వర్షాలు కురిస్తేనే పంటలు సాగు చేసేందుకు వీలవుతుంది. అలాగే బీడు భూములు సైతం ఉన్నాయి. అలాంటి భూములను సాగులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల పొలాల్లో ఫాంపాండ్స్‌ తవ్వడం ద్వారా వర్షపునీరు భూమిలోకి ఇంకిపోయి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. వర్షాలు లేని సమయంలో కుంటల్లో అందుబాటులో ఉన్న నీటితో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. 9X9, 5X5 మీటర్ల కొలతలతో ఫాంపాండ్స్‌ ఏర్పాటు చేయనున్నారు. పొలం పత్రాలు, ఆధార్‌కార్డు తదితర వివరాలతో రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

రైతుల పొలాల్లో ఉచితంగా తవ్విస్తారు

వేసవిలో రైతులు ఇబ్బందులు పడకుండా, భూగర్భజలాలు వృద్ధి చెందేలా ఫాంపాండ్స్‌ను ప్రభుత్వం ఉచితంగా తవ్విస్తోంది. ఇందుకోసం రైతులు మండల కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాలను ఉపాధి సిబ్బంది పరిశీలించి అనుమతి కోసం ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌లోడ్‌ చేస్తారు. అనంతరం రైతుల పొలాల్లో ఉచితంగా ఫాంపాండ్స్‌ తవ్విస్తారు.

– వెంకట్రావ్‌, డ్వామా పీడీ

భార్యపై అలిగి ఆత్మహత్య

అనుమసముద్రంపేట: భార్యతో గొడవపడి వేరుగడ్డలు తిని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఏఎస్‌పేట మండలం కాకర్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్‌పేట ఎస్సై కె.ప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు కాకర్లపాడు గ్రామానికి చెందిన యాకసిరి వెంకటేశ్వర్లు ఈ నెల 4వ తేదీన భార్యతో గొడవపడి ఓ చెట్టు గడ్డలు తిన్నాడు. దీంతో వాంతులు కావడంతో అతని భార్య ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స కోసం చేర్పించింది. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరులోని వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి వెంకటేశ్వర్లు మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లెక్కా పత్రం లేని సొమ్ము స్వాధీనం

- పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో రూ.33 లక్షలు స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

నెల్లూరు(క్రైమ్‌): రైలులో లెక్కా పత్రం లేకుండా తీసుకెళుతున్న రూ.33 లక్షల నగదును రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా నెల్లూరు రైల్వే డీఎస్పీ సి.విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో సీఐ భుజంగరావు తన సిబ్బందితో కలిసి రైళ్లల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. తాజాగా బుధవారం ఇన్‌స్పెక్టర్‌ పర్యవేక్షణలో గూడూరు రైల్వే ఎస్సై కొండపనాయుడు తన సిబ్బందితో కలిసి చెన్నై నుంచి విజయవాడ వెళుతున్న పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టారు. గూడూరుకు చెందిన నిమ్మకాయల వ్యాపారి గిరి వద్ద రూ.33 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం గిరిని విచారించగా చెన్నైలోని వ్యాపారులు ఇవ్వాల్సిన నగదును తీసుకుని వస్తున్నానని తెలిపారు. అయితే సదరు నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు సీజ్‌ చేశారు. గురువారం నగదును ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావు తెలిపారు.

ఏపీ ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్‌గా శ్రీనివాస్‌



విజయవాడలో నియామక పత్రాలను అందుకుంటున్న శ్రీనివాస్‌

నెల్లూరు రూరల్‌: ఏపీ ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్‌గా నెల్లూరు రూరల్‌ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పాళం శ్రీనివాస్‌ బుధవారం విజయవాడలోని ఆ కార్పొరేషన్‌ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్‌ సీఈఓ సేతు మాధవన్‌ సమక్షంలో నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టులో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్ట్‌ ఇంజినీర్లు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 400 మెగావాట్లు, 2వ యూనిట్లో 460 మెగావాట్లు, 3వ యూనిట్లో 630 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు తెలిపారు.

పొత్తు లేకుండా ఎన్నికలకు వెళ్లలేవా బాబూ?

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు పొత్తు లేకుండా ఎన్నికలకు వెళ్లలేడని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని పుల్లారెడ్డి నగర్‌లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయాలను వ్యాపారమయం చేసిన ఘనుడన్నారు. ఆయన అబద్ధాలు, మోసాలు, కుట్రలకు బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శించారు. ఎన్నికల క్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొట్టే సత్తా లేక బీజేపీతో జత కట్టేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. పథకాల పేరుతో వంచనకు గురిచేసిన చంద్రబాబు పవన్ కళ్యాణ్‌తోపాటు ఇతర పార్టీల పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాడన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పచ్చ పార్టీ నేతలు చెప్పే కథలను నమ్మొద్దని ప్రజలను కోరారు. బాబు కోసం పవన్ పార్టీ పెట్టారన్నారు. లోకేశ్ అవినీతిపరుడని మాట్లాడిన ఆయన ఇప్పుడు వారితో తిరుగుతున్నాడని విమర్శించారు. ప్రజా సంక్షేమం విషయంలో సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులున్నారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి గ్రామానికి చెందిన మహిళపై జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జె.అంజయ్య తీర్పు చెప్పారని ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2018 ఏప్రిల్ 6వ తేదీన కంభాల సుజాత పుల్లాయపల్లి చెరువు వద్దకు మేకలను తోలుకెళ్లింది. ఆ సమయంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి ఆమెను గొంతు నులిమి చంపుతామని బెదిరించి మేకలను తమవాహనంలోకి ఎక్కించారు. అలాగే రూ.1,000 నగదు దోచుకుని ఆమెను బండరాయితో కొట్టి చంపేందుకు ప్రయత్నించారు. సుజాత కేకలు వేయగా సమీపంలో ఉన్న గ్రామస్తులు రావడంతో నిందితులు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి మంగళవారం మైదుకూరుకు చెందిన నాసరి సుంకన్న, కర్నూలు జిల్లాకు చెందిన శ్రీరామ్ రాజేష్‌కు ఏడాదిపాటు జైలుశిక్షతోపాటు రూ.1000 చొప్పున జరిమానా విధించారని ఎస్సై వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఏ కష్టమొచ్చిందో తెలియదు గానీ గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం విజయమహల్‌గేటు వద్ద చెన్నై వైపు వెళ్లే పట్టాలపై చోటుచేసుకుంది. మృతుడి వయసు 60 నుంచి 65 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. వైట్ కలర్ హాఫ్ హ్యాండ్స్ టీషర్టు, బ్లూ కలర్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్నాం

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని డిప్యూటీ మేయర్, ఆ పార్టీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నెల్లూరు మైపాడుగేట్ సెంటర్లో ఉన్న కేపీఆర్ కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు జరిగాయి. ఖలీల్ అహ్మద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నగర నియోజకవర్గంలో 2,445 సంఘాల్లోని గ్రూపు సభ్యులకు రూ.19.73 కోట్ల చెక్కును ఇవ్వడం జరిగిందన్నారు. దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఈ స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేసిన సందర్భాల్లేవన్నారు. పేదలకు అండగా నిలిచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. 2019 నుంచి సిటీలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ అనేక అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, అందరూ సహకరించాలని కోరారు. మెప్మా పీడీ రవీంద్ర మాట్లాడుతూ మెప్మాలో ఆసరా కింద ఇప్పటి వరకు 7,341 సంఘాలకు రూ.218.29 కోట్లు అందించామన్నారు. నాలుగో విడతలో రూ.56.78 కోట్లు ఇచ్చామన్నారు. జగనన్న మహిళా మార్టులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును ఖలీల్ అహ్మద్ అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు శైలమ్మ, భవాని, సుహాసిని, శాంతి, మెప్మా సిబ్బంది అంకయ్య, సీఎంఎం పెంచలయ్య, బీఎల్ సురేంద్ర, కాంతయ్య, సుధాకర్, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సీఓలు, ఆర్పీలు, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న సమన్వయకర్త ఖలీల్ అహ్మద్

బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలి


మాట్లాడుతున్న సంజనా సింహ, చిత్రంలో అధికారులు

• ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహ

వెంకటాచలం: బాలికలు ఉన్నత విద్య ను అభ్యసించి ఉద్యోగాలు చేయాలని ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహ పిలుపునిచ్చారు. మండలంలోని గొలగమూడి వద్దనున్న గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సద స్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ కుమార్తెలను ప్రాథమిక విద్యకే పరిమితం చేసి ఉన్నత చదువుకు దూరం చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమనే విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలని సూచించారు. అమ్మాయిలపై అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకొచ్చిందని, వాటి గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. సదస్సులో ఐసీడీఎస్ పీడీ బి.హేనాసుజన్, బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, పాఠశాల ప్రిన్సిపల్ కె.రాణి అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

26 మంది డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు

నెల్లూరు(దర్గామిట్ట): రెవెన్యూ శాఖకు సంబంధించి 26 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దగదర్తి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న టీవీఎం కృష్ణప్రసాద్‌ను కావలికి, బోగోలు డీటీ జి.వెంకటేశ్వర్లును ఏఎస్‌పేటకు, ఆత్మకూరు ఇన్‌చార్జి తహసీల్దార్ వి.జగదీష్‌బాబును నెల్లూరు అర్బన్ డీటీగా, చేజర్ల ఇన్‌చార్జి తహసీల్దార్ పి.కృష్ణను ఉదయగిరి డీటీగా, మర్రిపాడు డీటీ వి.ఆనందరావును బుచ్చిరెడ్డిపాళేనికి, దగదర్తి డీటీ ఎస్.చెంచయ్యను వరికుంటపాడుకు, సెలవులో ఉన్న సీఎస్ డీటీ ఎం. సురేష్ బాబును వలేటివారిపాళెం డీటీగా, అనంతసాగరం ఇన్‌చార్జి తహసీల్దార్ వై.సుభాషిణిని సంగం డీటీగా, కొండాపురం ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.శ్రీనివాసులును దుత్తలూరు డీటీగా, కలెక్టరేట్‌లో స్పెషల్ తహసీల్దార్‌గా ఉన్న పి.శ్యామలకుమారిని కొడవలూరు డీటీగా, మనుబోలు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న బి.శివకృష్ణయ్యను పొదలకూరు డీటీగా, బుచ్చిరెడ్డిపాళెం సీఎస్ డీటీ బి.మురళీని నెల్లూరు చెక్‌పోస్టు డీటీగా, షేక్ డానియేల్ పీటర్ రావును ముత్తుకూ రు డీటీగా, పొదలకూరు సీఎస్ డీటీ ఐ.రవిని వెంకటాచలం డీటీగా, నెల్లూరు ఏడీ లోకలైజేషన్ స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ డి.వెంకటేశ్వర్లును కలువాయి డీటీగా, కలువాయి డీటీ డి.మంజులను అనంతసాగరం డీటీగా, రాపూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ డీటీ షేక్ జమీర్‌బాషాను కోవూరు ఎన్నికల డీటీగా, ఇందుకూరుపేట సీఎస్ డీటీ యు.రాజశేఖర్‌ను నెల్లూరు రూరల్ ఎన్నికల డీటీగా, ఏపీ ట్రాన్స్‌కో ఎస్‌డీటీ టి.మధుబాలను ఆత్మకూరు ఎన్నికల డీటీగా, కావలి ఎంఎల్ఎస్ పాయింట్ ఎస్‌డీటీ కె.వెంకటరామిరెడ్డిని కావలి ఎన్నికల డీటీగా, కలిగిరి డీటీ వి.మురళీధర్‌రాజును ఉదయగిరి ఎన్నికల డీటీగా, రాపూరు ఎస్‌డీసీ స్పెషల్ డీటీ యు.లక్ష్మిని కందుకూరు ఎన్నికల డీటీగా, ఇంకా మరికొందరిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.63
సన్నవి	రూ.50
పండ్లు	రూ.25

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	138
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	270
లేయర్ చికెన్	145